

# యండమూరి కథాస్రవంతి

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## లవ్ ఎట్ ఫస్ట్ సైట్
## (జనవరి 7, 1981 ఆంధ్రప్రభ వారపత్రిక నుంచి)




ఆ చిన్న సంఘటన.

సౌత్ హిల్స్ ఏరియాలో విసిరేసినట్టున్న ఇళ్ళ మధ్య చిన్న బంగళా అతడిది. రాత్రి ఎనిమిదింటికి సుదర్శన్ ఇంటర్నేషనల్‌లో కాన్ఫరెన్సుని ముగించుకొని అతడు ఇంటికి వస్తున్నాడు.

వర్షపు జల్లు అలలు అలలుగా పడుతోంది. పైకి ఎత్తిన గాజు అద్దాల సందుల్లోంచి చల్లటి గాలి రివ్వున వీస్తోంది. కారు లైట్ల కాంతిలో కొండల మధ్య దారి మెలికలు తిరిగిన పాములా మెరుస్తూంది. చాలాసేపటి నుంచి వర్షం కురుస్తూ ఉండటం వల్ల రోడ్డు నిర్మానుష్యంగా ఉంది.

అతడింకో అయిదు నిముషాల్లో ఇల్లు చేరుకోబోతాడనగా, కుడివైపుకి మలుపు తిరుగుతూ ఉంటే కారు లైట్ల వెలుగులో ఆమె చెట్టు పక్క నుంచి చెయ్యి కదపటం క్షణంలో వెయ్యవ వంతులో చూశాడు.

కీచుమన్న బ్రేకుల శబ్దంతో కారు ఆగింది.

అతడు తల తిప్పి కారు అద్దం గుండా చూశాడు. వీధి లైట్ల కాంతిలో ఆమె తెల్లచీర అస్పష్టంగా కనిపిస్తూంది.

'ఆమె చెయ్యి ఎత్తి లిఫ్ట్ అడిగిందా? లేక పొరపాటున నేనే కారు ఆపుచేశానా?' అన్న అనుమానం వచ్చింది.

ఆడవాళ్ళతో పరిచయం చేసుకోవటమూ, మాట్లాడటమూ, తనంతట తాను చొరవ తీసుకోవటమూ లాంటి విషయాలు అతడికి తెలియవు. నిద్రపోవటానికి తప్ప మిగతా సమయమంతా తన బిజినెస్ గురించి ఆలోచించటానికే సరిపోతుంది అతడికి.

ఎవరో అమ్మాయి రోడ్డుపక్కగా కనబడగానే కారు ఆపుచేసిన తన అసంకల్పిత చర్యకు సిగ్గుపడి అతడు కారు తిరిగి స్టార్టు చెయ్యబోయాడు. కానీ అంతలోనే ఆమె చెట్టు పక్కనుంచి కారువద్దకు రావటం రియర్ మిర్రర్‌లోంచి గమనించాడు. అతడి గుండె వేగంగా కొట్టుకోసాగింది. పక్కకు వంగి, కారుకు అటు వైపున్న గాజు అద్దం కిందకు దింపాడు. ఈలోపు ఆమె కారు దగ్గరకు చేరుకుంది. విండో లోంచి లోపలకు చూస్తూ, 'ఉడ్ యూ మైండ్ గివింగ్ మి ఎ లిఫ్ట్ అప్ టూ ది ఎయిర్‌పోర్ట్? ఇఫ్ యూ డోంట్ మైండ్, ప్లీజ్!" అన్నది.

...

కారు రెండవ వైపు అద్దం కూడా కిందకి దించటం వల్ల చల్లగాలి మరింత బలంగా లోపలకు వీస్తూంది. అయినా, అతడికి అది అంతగా పట్టలేదు. తనకి అడుగున్నర దూరంలో కూర్చున్నది ఒక అమ్మాయి అన్న భావన అతడికి చాలా థ్రిల్లింగ్ గా ఉంది. సెక్సువల్‌గా కాదు – కేవలం థ్రిల్లింగ్ గా.

దూరంగా పల్లంలో ఊరు తాలూకు మినుకు మినుకుమంటున్న దీపాలు దీపావళి రోజు ప్రమిదల్లా ఉన్నాయి.

"మీ ఇల్లు ఈ ప్రాంతాల్లోనే అయితే నా గురించి ఎయిర్‌పోర్టు వరకు వచ్చే శ్రమ తీసుకోకండి" అందామె ఇంగ్లీషులో.

"అబ్బెబ్బె! అటువంటిదేమీ లేదు" అన్నాడు తడబడుతూ. అటువంటిదేమీ లేదు అనటంలో ఉద్దేశ్యం తన ఇల్లు అటే అనో, శ్రమ తీసుకోవటం లేదనో ఆమెకు తెలియనివ్వకుండా.

"నా పేరు కల్పన. బి. ఎస్‌సి. ఫైనలియర్ చదువుతున్నాను. నాన్నగారు రిటైర్డ్ ఐ. ఎ. ఎస్. ఆఫీసరు. ఎయిర్‌పోర్ట్ ఎదురుగా ఉండే కాలనీలో ఉంటున్నాం" అంది ఆమె.

"నా పేరు నవీన్ చంద్ర. ఎం. బి. ఎ. చదివాను. ఆ తరువాత ఫిలిప్పైన్స్‌లో రెండు సంవత్సరాల ట్రెయినింగ్. ఆర్థర్ అండ్ హెయిలీలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పని చేస్తున్నాను. నాన్న లేరు. అన్నయ్య అమెరికాలో డాక్టరు. అమ్మ నాతోనే ఉంటూంది. మా కంపెనీ వాళ్ళు ఇల్లు ఇచ్చారు. నా జీతం..." అని ఏదో అనుమానం వచ్చినట్టు తలతిప్పి చూశాడు. ఆమె తల దించుకుని తనలో తనే నవ్వుకోవటం అస్పష్టంగా కనిపించింది. తాను అవసరమయిన దాని కంటే ఎక్కువ పరిచయం చేసుకుంటున్నానని గమనించి మొహం సిగ్గుతో ఎర్రబడింది. చప్పున మాట మార్చాలి కనక, ఏం మాట్లాడాలో తెలియక, అంతలోనే ఎయిర్‌పోర్టు సమీపించటం చూసి, "కొంచెం టీ తాగి వెళదామా?" అన్నాడు.

ఆమె అది ఊహించనట్టు అతడివైపు చిత్రంగా కానట్టు చూసింది. ఆమె మౌనాన్ని అంగీకారంగా భావించి అతడు కారును సర్రున ఎడమ వైపుకి కోసాడు.

ఎయిర్‌పోర్టులోకి దారి అందంగా ఉంది. రోడ్డుకి ఇరువైపులా దీపాలు. చుట్టూ లాన్, పూలమొక్కలు. దూరంగా బిల్డింగ్ పైన నెమ్మదిగా తిరుగుతున్న లైటు.

అతడి కారు పార్కింగ్ స్పేసులోకి వెళ్ళి ఆగింది.

అప్పుడు రాత్రి ఎనిమిదిన్నర అయింది.

...

"మీరు డబ్బు బాగా ఖర్చు పెడతారనుకుంటానే" అన్నదామె, ఎయిర్ పోర్ట్ బయట పై అంతస్తు హోటల్ లో కూర్చున్నాక.

"ఎందుకలా అనుకుంటున్నారు?"

"కప్పు టీ తాగటానికి కారు పార్కింగ్‌కు యాభై రూపాయి, లోపలికి రావటానికి వంద రూపాయలు ఖర్చు పెట్టటం చూసి" నవ్విందామె.

అతడు మాట్లాడలేదు.

దూరంగా వర్షంలో తడిసిన రన్‌వే, దివిటీలు పట్టుకున్న సైనికుల్లా దానికి అటూ ఇటూ ఉన్న ఎర్రటి –నీలపు లైట్లు, ఎక్కడో దూరంగా వెలుతురులో కలిసిపోయిన చీకటి, అస్పష్టమైన నిశ్శబ్దం – అన్నీ అతడికి అదొక విధమైన, అంతకు ముందెప్పుడూ లేని ఒక విచిత్రమైన అనుభూతిని కలుగజేస్తున్నాయి. ఆ ట్రాన్స్‌నుంచి బలవంతంగా బయటపడి – "నిజానికి నేను చాలా జాగ్రత్తగా, పొదుపుగా ఖర్చు పెడతానని మా స్నేహితులందరూ

అంటూ ఉంటారు" అన్నాడు. ఆమె తల పైకెత్తి నవ్వింది. అంతలో వెయిటర్ వచ్చాడు. "రెండు సాండ్ విచెస్, కట్‌లెట్, టీ విత్ మీడియం షుగర్" ఆర్డరిచ్చాడు.

"ఇదేమిటి? టీ అని చెప్పి డిన్నర్ ఆర్డర్ ఇచ్చారు? మీరు భోజనం చెయ్యలేదా?"

అతడు తల అడ్డంగా ఊపి, "ఇప్పుడే కాన్ఫరెన్స్ నుంచి ఇంటికి వెళుతున్నాను" అన్నాడు.

"నేను సౌత్ హిల్స్‌లో ఉన్న స్నేహితురాలి ఇంటికి వెళ్ళాను. వర్షం వచ్చేటట్టు ఉంది వెళ్ళద్దన్నారు నాన్నగారు. సన్నగా పడే వర్షం అంటే భలే ఇష్టం నాకు. పర్వాలేదన్నాను..." నవ్వింది. "...కానీ అంతలో వర్షం ఎక్కువైంది. అసలు జన సంచారం లేకపోవటంతో మరీ భయం వేసింది. ఆ చెట్టు వెనుక నిలబడ్డాను. ఒక్క ఆటో కూడా రాలేదు. రెండు, మూడు కార్లు వెళ్ళాయి. ఆపుదామంటే భయం. ఏం చెయ్యాలో తోచక తటాపటాయిస్తూన్న సమయంలో మీ అంతట మీరే కారు ఆపు చేశారు."

'మీరు చెయ్యి ఎత్తి ఆపమనలేదా?' అని అడుగుదామనుకున్నాడు కానీ, ఎందుకో అడగలేదు.

భయం భయంగా చీకటి రోడ్డుమీద నిలబడి ఉన్న అమ్మాయికీ, వెళుతోన్న కారు ధైర్యంగా ఆపుచేసి ఎక్కే అమ్మాయికీ చాలా భేదం ఉంది.

ఆమె అంటూంది, "మీరు కానీ కారు ఆపు చెయ్యకపోతే ఏం చేసేదాన్నో? చీకటి పడుతున్న కొద్దీ భయం ఎక్కువ అవుతూంది. వెనక్కి వెళ్దామంటే, అప్పటికే స్నేహితురాలింటి నుంచి చాలా దూరం వచ్చేశాను. వర్షంలో తడవటం కదా. అసలు టైమే తెలియలేదు."

అతడు ఆమె నాజూకైన చేతివేళ్ళకేసీ, మణికట్టు మీది రిస్టు వాచి కేసీ, మోచేతి మీద పుట్టు మచ్చ కేసీ, బిగుతైన జాకెట్టు కేసీ, తెల్లటి మెడ కేసీ, వంపు తిరిగిన గెడ్డం కేసీ, దాని పైన ఎర్రటి పెదవి కేసీ, ఆపైన కొనదేలిన ముక్కు కేసీ, ఇంకా ఆ పైన కళ్ళకేసీ చూసి, ఒకసారి కళ్ళూ కళ్ళూ కలుసుకోగానే నవ్వి, "పోనీలెండి, నా అదృష్టం, కారు అదృష్టం" అన్నాడు.

అంతలో వెయిటర్ ట్రేతో వచ్చాడు. బల్ల మీద ప్లేట్లు నీట్‌గా సర్ది వెళ్ళిపోయాడు. ఆమె కట్‌లెట్‌ని కత్తితో కోస్తూ, "లిఫ్ట్ ఇవ్వటం కోసం మీరు ఇలాగే కారు ఆపుతూ ఉంటారా?" అంది.

ఊహించని ఈ ప్రశ్నకి గొంతులో ఏదో అడ్డు పడ్డట్టు అయింది. కానీ చాలా నిజాయితీగా, "ఊహూ. సాధారణంగా ఎవ్వరూ అడగరు" అన్నాడు.

"మరి నేనూ అడగలేదుగా?"

ఆమె చీకట్లో అస్పష్టంగా చెయ్యి ఎత్తినట్టు కనిపించిన సంగతి చెబుదామనుకున్నాడు కానీ, ఇరిటేట్ చేసినట్టు ఉంటుందని చెప్పలేదు. టాపిక్ మార్చి – "మీ హాబీస్ ఏమిటి?" అన్నాడు.

ఆ తరువాత వాళ్ళ సంభాషణ ఇంకో వైపుకి మళ్ళింది. వారి వారి అభిరుచులు, చూసిన ప్రదేశాలు, రాజకీయాలు, ఒలింపిక్స్ – అన్నీ చుట్టేసేక 'బిల్ ఎవరు ఇవ్వాలి' అన్న విషయం మీద ఘర్షణ పడి, చివరికి బయటకి వచ్చారు.

అప్పుడు తొమ్మిదయింది.

...

"ఎటు మీ ఇల్లు?" ఎయిర్‌పోర్టు బయటకు వస్తూ అడిగాడు. రోడ్డుకవతల వైపునున్న కాలనీ చూపించింది. పోష్ కాలనీ.

"మీ నాన్నగారికి ఎంతమంది సంతానం?"

"నేనొక్కతినే కూతుర్ని. అదిగో – ఆ అశోక వృక్షాలున్న ఇల్లే" అంది. అతడు కారు ఆపు చేశాడు. ఆమె వెంటనే కారు దిగకుండా అతడి వైపు చూసి నవ్వింది. ఆమె అలాగే ఒక క్షణం పాటు కూర్చుని ఉంటే బాగుండునని అతడూ అనుకున్నాడు. ఆ క్షణం ఎన్నో క్షణాలైతే మరీ బాగుండునని కూడా అనిపించింది.

అతడి ఆలోచనలని భగ్నం పరుస్తూ, "వెళ్ళొస్తానండి. థాంక్స్. రేపు రండి. నాన్నగారిని పరిచయం చేస్తాను. అండ్ మళ్ళీ... థాంక్‌యూ ఫర్ ది నైస్ రైడ్ అండ్ ఎ కప్ ఆఫ్ టీ" అన్నది.

అతడు ఆమె వైపు ఆరాధనగా చూస్తూ నెమ్మదిగా అన్నాడు – "కల్పనా, ఐ లైక్ యూ".

...

అతడు టైనాట్ సర్దుకొంటూంటే కల్పన వెనక నుంచి వచ్చి కారు తాళాలు అందిస్తూ, "సాయంత్రం తొందరగా వస్తున్నారా?" అని అడిగింది. ఒక వైపు తల దువ్వుకుంటూనే అద్దంలో ఆమెను చూస్తూ, "వచ్చేస్తాను, ఏం?" అని అడిగాడు.

"సాయంత్రం షాపింగ్‌కు వెళదామనుకుంటున్నాను" అంది. ఆమె చేతి నుంచి తాళం చెవులూ, వాటితో పాటూ ఆమె చేతులూ అందుకుంటూంటే తాళం చేతులు క్రింద పడిపోయి, ఖాళీ అయిన చేతులు పాదు చేతలలో నిమగ్నం కాబోతూంటే... "ఏమిటిది, పెళ్ళయి ఆర్నెల్లు కావస్తూంటే!" అంది చిరుకోపంతో.

"ప్రేమకీ, కాలానికీ సంబంధం లేదోయ్! అందులోనూ మనది లవ్ ఎట్ ఫస్ట్ సైట్" అన్నాడు.

"సైట్ అంటే జ్ఞాపకం వచ్చింది. మా ఇంటికి వెళ్ళాలి. చాలా కాలం అయింది నాన్నని చూసి."

"సరే. అయితే, నేను ఇంటికి ఆలస్యంగానే వస్తానులే" అన్నాడు అతడు కారు వద్దకు నడుస్తూ.

అతడు ఆఫీసుకు చేరుకునేసరికి పదింపావు అయింది. దాదాపు నాలుగు గంటల వరకూ ఊపిరి సలపని పనులలో మునిగిపోయాడు. అయిదవుతూండగా ఆఫీసు నుంచి బయటికి వచ్చాడు. కారులో కూర్చుని స్టార్ట్ చేశాడు. వర్షం తగ్గింది కానీ, సన్నగా తుంపర పడుతూంది. మేఘాలు దట్టంగా అలుముకోవటం వల్ల అయిదింటికే బాగా చీకటి పడిపోయింది.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది అతడికి – కల్పన సాయంత్రం షాపింగ్‌కు వెళ్ళి, అక్కడి నుంచి తన ఇంటికి వెళతానని చెప్పటం. తన దగ్గర డూప్లికేట్ తాళం ఉంది కానీ, ఇంటికి వెళ్లేసరికి భార్య ఇంట్లో ఉండదన్న ఫీలింగ్ ఎందుకో చికాకుగా అనిపించింది. తన కాలనీ లోపలికి వెళ్ళబోతూ మనసు మార్చుకొని, కారుని ఎడమవైపుకి తిప్పాడు. రెండు కిలోమీటర్ల దూరంలో వెస్ట్‌హిల్స్. అయితే, తన భార్య ఆమె నాన్నగారి ఇంటికి వెళ్లిందో, షాపింగ్ అయ్యాక వర్షాన్ని చూసి తమ ఇంటికే వెళ్ళిపోయిందో తెలియదు. మరి తనెందుకు ఇలా ఈ కొండల్లో తిరుగుతున్నట్టు?

తన చర్యకు తనే నవ్వుకుని కారు వెనక్కు తిప్పి ఇంటి వైపు పోనిచ్చాడు.

బాగా చీకటి పడిపోయింది. వంద గజాల దూరంలో వస్తువు కూడా కనిపించటం లేదు. రోడ్డు మీద లైట్లు కూడా చీకటిని పారద్రోలలేక పోతున్నాయి. కారు అద్దాల్లోంచి చలిగాలి బలంగా లోపలికి వీస్తూంది.

అకస్మాత్తుగా అతడు కారు స్లో చేశాడు.

దూరంగా చెట్టు కింద ఒక అమ్మాయి నిలుచుని ఉంది. మసక చీకట్లో అస్పష్టంగా, తెల్లచీరె కట్టుకుని కనిపిస్తూంది.

కల్పనే!

కారు నెమ్మదిగా ఆమెకు దగ్గర అవుతూంది.

తనది నల్ల కారు అనీ, తన కారు ఈ దారిలో రావటాన్ని ఆమె ఊహించదనీ, తన కారు హెడ్‌లైట్లు ముందుకు పడటం వల్ల కారు రంగు అవతలి వ్యక్తికి కనిపించదనీ, కేవలం ఒక కారు వస్తూన్నట్టు మాత్రమే తెలుస్తుందనీ అతడు భావించాడు. మరి కల్పన చెయ్యి ఎత్తి కారు ఆపుతుందా?

ఈ మసక చీకట్లో పరాయి వాడి కారును ఆపి...

ఎక్కుతుందా?

ఆమె అడుగు ముందుకు వేసింది.

---

కల్పన అడుగు ముందుకు వేసింది.

ఫర్లాంగు దూరం నుంచి అయినా ఆమె తమ కారు చప్పుడు గుర్తు పట్టగలదు. ఆమెకు సంతోషం కలిగింది. ఆ సంతోషంలోనే అడుగు ముందుకు వేసింది.

కానీ, అంతలోనే ఆమెకు ఒక అనుమానం వచ్చింది.

చెట్టు చాటున ఉన్న తనను అతడు పోల్చుకోలేడని ఆమె భావించింది. కేవలం ఒక స్త్రీ – నిర్మానుష్యమైన రోడ్డు మీద కనబడితే కారు ఆపుచేస్తాడా తన మొగుడు?

ఏమో? చూడాలి.

ఆమె అలాగే నిలబడి ఉంది.

కారు దగ్గర అవుతూంది.

తన భార్య చెయ్యి ఎత్తి పరాయి వాడి కారు ఆపు చేస్తుందా అని అతడు ఆలోచిస్తున్నాడు.

తన భర్త కారు ఆపి, పరాయి స్త్రీకి లిఫ్ట్ ఇస్తాడా అని ఆమె వేచి ఉంది.

ఆమె చెయ్యి ఎత్తి కారు ఆపిందా? అతడు కారు తనంతట తానే ఆపు చేశాడా? అన్నది ఇక్కడ ఈ కథకు అప్రస్తుతం.

★★★

(వచ్చే నెల మరో కథతో కలుసుకుందాం)

కౌముది